క్లుప్తంగా

వెళ్లిరా బొడ్డెమ్మ..వెళ్లిరావమ్మ



ఆత్మకూరు : బొడ్డెమ్మను నిమజ్జనం చేసేందుకు వెళ్తున్న మహిళలు

దామెర /శాయంపేట ఆత్మకూరు : వెళ్లిరా బొడ్డెమ్మ వెళ్లి రావమ్మ.. మళ్లొచ్చే ఏటికి తిరిగి రావమ్మ అంటూ బొడ్డెమ్మను శనివారం నిమజ్జనం చేశారు. దామెర, శాయంపేట, ఆత్మకూరు మండలాల్లోని అన్ని గ్రామాల్లో బొడ్డెమ్మను తొమ్మిది రోజులు ఘనంగా పూజించారు. పుట్ట మట్టితో బొడ్డెమ్మను తయారు చేసి పసుపుతో గౌరమ్మను తయారు చేసి పూలు, పండ్లు, కుంకుమ ధూపదీప నైవేద్యాలు సమర్పించి పవిత్రంగా పూజలు చేశారు. చివరి రోజు పసుపు, కుంకుమను మహిళలు పంచుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కరుణాకటాక్షాలకు పాత్రులయ్యారు.

'పీఎం స్వనిధి'ని సద్వినియోగం చేసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ సుష్మ

పరకాల: వీధి వ్యాపారుల కోసం ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు అమలు చేయనున్న పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి పరకాల మున్సిపల్ కమిషనర్ కె.సుష్మ కోరారు. శనివారం పరకాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వీధి వ్యాపారులకు డిజిటల్ లావాదేవీలు, సామాజిక భద్రతా పథకాలు, ప్రధాన మంత్రి స్వనిధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుష్మ మాట్లాడుతూ.. వీధి వ్యాపారులకు మొదటి విడత రూ.15 వేలు, రెండో విడత రూ.25 వేలు, మూడో విడత రూ.50 వేలు అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రెగ్యులర్‌గా చెల్లించిన వారికి రూ.30 వేల వరకు క్రెడిట్ లిమిట్‌తో కూడిన బ్యాంకు క్రెడిట్ కార్డులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె వివరించారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

పరకాల : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చక్రవర్తుల మధు సూచించారు. శనివారం పాఠశాలలో పాఠశాల హౌజ్ సిస్టం, స్టూడెంట్ కౌన్సిల్ (నాలుగు విభాగాలు)గా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో స్కూల్ బాలుర హెడ్‌గా ధనుష్, స్కూల్ గర్ల్స్ హెడ్‌గా సమ్రీన్, స్పోర్ట్స్ క్యాప్టెన్‌గా గౌతంరాజు, శ్రావ్యను ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్ సిగ్గుచేటు

శాయంపేట : భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని, రైతులకు సరిపడా యూరియా అందించాలని బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపితే పోలీసులతో అక్రమంగా అరెస్ట్ చేపించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలపై సొంత పార్టీ నాయకులే ధర్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని, వెంటనే క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి 'అరూరి' పరామర్శ

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పడిదల సమ్మారావు తల్లి సోమక్క ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సోమక్క మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే అనారోగ్యంతో అదే గ్రామానికి చెందిన కాటబోయిన నర్సయ్య మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాంనగర్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన బుర్ర సాంబరాజు, సురేందర్ మృతిచెందగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

చెరువులో దూకిన వ్యక్తి మృతదేహం లభ్యం

ఐనవోలు/బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో దూకిన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం రాంనగర్‌కు చెందిన బర్ల సురేందర్(36) ఈ నెల 19న బీబీనగర్ పెద్ద చెరువులో దూకాడు. రెస్క్యూ బృందం రెండు రోజులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టి శనివారం మృతదేహాన్ని వెలికి తీసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు రాంనగర్‌కు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు.

కల్లాలుగా మారుతున్న రోడ్లు

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
● పంటలు ఆరబెట్టేందుకు ప్రత్యేక కల్లాలు ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్
● పట్టించుకోని పాలకులు, అధికారులు



రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న కంకులు

ఐనవోలు : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత బీటీ రోడ్లు కల్లాలుగా మారుతున్నాయి. ఆయా గ్రామాల రైతులు రోడ్లపైనే మొక్కజొన్న ఆరబోస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ ధాన్యం ఆరబోయడంతో కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి గాయపడుతున్నారు. అనేక మంది వాహనదారులు ఆస్పత్రుల పాలవుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తే ఒకటి, రెండు రోజులు హడావుడి చేసి అనంతరం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రైతులు పంటలు ఆరబోసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కల్లాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. పంట ఉత్పత్తులు విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చెలుకలల్లో పంటలు ఆరబోస్తే ఎండటం ఆలస్యం అవుతుండటంతోనే రోడ్లపై ఆరబోస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే వాహనదారులు తరుచూ ప్రమాదాల బారినపడడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనం కనిపించకపోవడంతో రైతులు అడ్డుగా పెడుతున్న చెట్టు కొమ్మలు, రాళ్లను ఢీకొని ద్విచక్ర వాహనదారులు చేతులు, మోచేతులు, మోకాళ్లు కొట్టుకుపోయి తీవ్ర గాయాలైన సంఘటనలు ఉన్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. వ్యవసాయ, పోలీసు, ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కల్పించి రోడ్లపై ధాన్యం, మొక్కజొన్న ఇతర పంటలను ఆరబోయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు, పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కల్లాలు ఏర్పాటు చేయాలి



రోడ్డుపై మొక్కజొన్న, ధాన్యంరాశులు ఆరబెట్టడంతో రాత్రివేళ వాహనదారులకు కనిపించడం లేదు. దీంతో అనేక మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల మా ఇంటి సమీపంలో ప్రమాదం జరుగగా ద్విచక్రవాహనదారునికి తీవ్ర గాయాలు అయ్యాయి. రోడ్లపై రైతులు పంట ఉత్పత్తులు ఆరబోయకుండా, ప్రమాదాలు నివారించాలంటే ప్రభుత్వం కల్లాలు ఏర్పాటు చేయాలి.

- వెంకటస్వామి, రైతు, వెంకటాపురం

ప్రజాదరణ ఓర్వలేకే ఆరోపణలు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి



మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

శాయంపేట : ప్రజల్లో కాంగ్రెస్ పార్టీతో పాటు తనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మైలారం పెద్ద చెరువుకట్టపై విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అనుభవం, అవగాహన లేకుండా పది రోజులుగా తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా సుదీర్ఘ అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వారి అనుచరుల మాటలు విని ఆరోపనలు చేయడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. 40 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమిపై నిజాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే చర్చకు రావాలని సవాల్ విసిరారు. పెద్ద చెరువుకట్ట రోడ్డు పనులు ఏ నక్ష ప్రకారం చేసినా, ఎలాంటి సర్వే చేసినా తనకు అభ్యంతరం లేదన్నారు. శ్మశాన వాటిక పక్కన తన తండ్రి 20 ఏళ్ల క్రితం దళితుల వద్ద పట్టా భూమి కొనుగోలు చేశారని, కొనుగోలు చేసిన అగ్రిమెంట్ పత్రాలు ఉన్నాయని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తనపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ఈ సందర్భంగా ఆయన హితవుపలికారు.

ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం

● తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి



మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

దామెర : ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. హనుమకొండ ఒకేషనల్ జూనియర్ కళాశాల జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) రెండు యూనిట్ల ప్రత్యేక శిబిరం శనివారం మండల కేంద్రంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. ఏడు రోజుల పాటు శ్రమదానం, సామాజిక రుగ్మతలపై గ్రామంలో అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. 'నేను నా కోసం కాదు సమాజం కోసం' అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రోగ్రాం అధికారులు మాట్లాడుతూ.. ఈనెల 26 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఎంపీడీఓ కల్పన, ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్, ఎంపీఓ రంగాచారి, పంచాయతీ కార్యదర్శి మనోహర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్, పీడీ దేవేందర్, రాజ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు

వివిధ మండలాల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. పరకార పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బిట్స్ పాఠశాల, ఐనవోలు మండల కేంద్రంలోని ఏకశిల, ఎంపీపీఎస్ పాఠశాలలో, ఆత్మకూరు మండలంలోని ప్రైవేటు, ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



పరకాల : డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



పరకాల : బిట్స్‌లో బతుకమ్మలతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



ఐనవోలు : ఎంపీపీఎస్‌లో..



ఐనవోలు : ఏకశిల స్కూల్‌లో.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు



మాట్లాడుతున్న ఎస్సై సురేష్

వేలేరు : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సురేష్ అన్నారు. మల్లికుదుర్ల శివారు కుమ్మరిగూడెంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి పోలీసు కళాజాత నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలు మూఢ నమ్మకాలతో మోసపోవద్దని, అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దని అన్నారు. ఓటీపీ, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికీ తెలుపొద్దని అన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

శాయంపేట : తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్ కుమార్‌ను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు.

గురుకుల విద్యార్థులకు మెడికల్ సీట్లు

వేలేరు : మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ రౌతు అజయ్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో 2022–24 బ్యాచ్‌కు చెందిన రఘువంశీకి నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, జోడుముంతల అరుణ్ నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేలేరు విద్యార్థిని

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వేలేరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని లావుడ్య నందిని ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న భీమదేవరపల్లిలో జరిగిన 25వ జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో వేలేరు, ధర్మసాగర్ జోనల్ నుంచి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్‌లో జరిగే సబ్ జూనియర్ పోటీల్లో హనుమకొండ జిల్లా జట్టు తరుపున ఆడనున్నట్లు తెలిపారు. విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అభినందించారు.

రైతుల ప్రాణాలతో కాంగ్రెస్ చెలగాటం

నడికూడ : రైతుల ప్రాణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన రైతు కల్యాణపు రాజమొగిలి యూరియా కోసం వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం పరామర్శించారు. యూరియా అందించకుండా రైతుల ప్రాణాలతో చెలగాలం ఆడుతుందని విమర్శించారు.

29న సద్దులు, 2న దసరా

పరకాల : హిందువులు అత్యంత వైభవంగా జరుపుకొనే బతుకమ్మ, దసరా పండుగలను పండితుల సూచనల మేరకు ఈనెల 29న(సోమవారం) సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2(గురువారం)న దసరా పండుగను జరుపుకోవాలని పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్ అరెస్ట్

ధర్మసాగర్ : నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.73 లక్షల గోల్డ్‌లోన్ తీసుకున్న యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆర్కల సురేశ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన కుటుంబ సభ్యుల పేరుతో అదే శాఖలో ఖాతా తెరిచాడు. ఎటువంటి బంగారు ఆభరణాలు తనఖా పెట్టకుండానే నకిలీపత్రాలు సృష్టించాడు. సుమారు 73 లక్షల రూపాయలు గోల్డ్ లోన్ తీసుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలిపారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు మేనేజర్ సురేశ్‌ను అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నడికూడ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్ సూచించారు. శనివారం డ్రై డే సందర్భంగా మండలంలోని కంఠాత్మకూరు గ్రామంలోని ఇంటింటిని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఎక్కడ కూడా నీటి నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు కూడా పరిశుద్ధ్యం లోపించకుండా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఎంపీడీఓ విమల, పంచాయతీ కార్యదర్శి భార్గవి, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ధర్మసాగర్ : లబ్ధిదారులతో ఎమ్మెల్యే శ్రీహరి



ఐనవోలు : లబ్ధిదారులతో ఎమ్మెల్యే నాగరాజు

● ఎమ్మెల్యేలు కడియం, కేఆర్
● కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ చెక్కుల పంపిణీ

ధర్మసాగర్ : నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలానికి చెందిన 21 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు, 41 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు చెక్కులు అందించి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నాని అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన 21 నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి రూ.1,026 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఏ కాలువ ఏవైపు పోతుందో కూడా తెలియని వ్యక్తి కాల్వ గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. రోడ్డుపై ఏనుగు వెళ్తుంటే కుక్కలు మొరుగుతాయని వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. తనని రాజీనామా చేయమనే హక్కు బీఆర్ఎస్‌కు లేదని, ఆనాడు బీఆర్ఎస్‌లో చేరిన 36 మంది ఎమ్మెల్యేలు ఎందుకు రాజీనామా చేయలేదో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న 3 ఏళ్లలో మరో 2వేల కోట్ల అభివృద్ధి నిధులు తీసుకువస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

అప్పులున్నా తట్టుకుంటున్నాం..

ఐనవోలు : గత ప్రభుత్వం చేసిన అప్పులను తట్టుకుని మిత్తీలు కడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమాన్ని ఆపకుండా సీఎం రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు అందించారు. 27 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ 27.03 లక్షలు, 22 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.6.82 లక్షల విలువచేసే చెక్కులను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. తెల్ల రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. యూరియా విషయంలో ప్రతిపక్షాల మాటలను నమ్మి రైతులు ఆందోళన చెందొద్దని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, ఎంపీడీఓ నర్మద, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచే వరకూ ఉద్యమం ఆగదు



ధర్మసాగర్ : ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మసాగర్ / వేలేరు / కమలాపూర్ / ఐనవోలు : వికలాంగులకు, చేయూత పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ పెంచే వరకు ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ధర్మసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట, వేలేరు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించగా కమలాపూర్‌లో ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్ పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ షహబాజ్‌కు వినతిపత్రం అందించారు. అలాగే ఐనవోలులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొక్కల నారాయణ పలు గ్రామాల కార్యదర్శులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు రూ.6,000, చేయుత పింఛన్ రూ.4,000లను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కండరాల క్షీణత కలిగిన వారికి రూ.15,000 ఇవ్వాలని, నూతన పింఛన్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు : వివిధ పథకాలకు అర్హులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగయ్యపల్లికు చెందిన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలతో పాటు యువవికాసం తదితర పథకాలకు ఇష్టారాజ్యంగా ఎంపిక చేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు సదానందం, ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు రజనీకాంత్, నాయకులు సుధాకర్, యాదగిరి, మాజీ సర్పంచ్ సాంబయ్య, స్వామి, ఐలయ్య, శ్రీలత, సుమలత, సునీతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ సేవలు అభినందనీయం



విద్యార్థులతో దుర్గా ప్రతాప్‌రెడ్డి, ఎంఈఓ ఆనందం

ఐనవోలు : డీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎంఈఓ పులి ఆనందం అన్నారు. శనివారం మండలంలోని అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు గణితం వర్క్ బుక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ యంగ్ మైండ్స్ అనే పుస్తకాలను ట్రస్ట్ వ్యవస్థాపకుడు దుర్గా ప్రతాప్‌రెడ్డి అందించగా ఎంఈఓ పంపిణీ చేశారు. గుణాత్మక విద్యలో భాగంగా విద్యార్థులను ప్రగతి పథంలో నడిపించేందుకు వర్క్‌బుక్స్ ఉపయోగపడుతాయన్నారు. రూ.30 వేలు విలువచేసే పుస్తకాలు అందిచండం సంతోషకరమన్నారు. విద్యార్థులకు దాతల సహకారం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కక్కిరాలపల్లి హెచ్‌ఎం రామకృష్ణ, వసంత్‌కుమార్, డీఎస్ఆర్ సభ్యులు అశోక్, నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెస్ పోటీలతో జ్ఞాపకశక్తి పెంపు



మాట్లాడుతున్న ధర్మప్రకాశ్

ధర్మసాగర్ : చెస్ పోటీలతో జ్ఞాపకశక్తి పెంపొందుతుందని చెస్ క్లబ్ అధ్యక్షుడు ధర్మప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం చెస్ క్లబ్ కోశాధికారి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. ప్రకృతి పూల పండుగ బతుకమ్మ సంబురాలను పురస్కరించుకుని అవిభక్త వరంగల్‌వారు ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలను బాలికలకు, మహిళలకు ఈనెల 28న హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం ఆవరణలో చెస్ నెట్‌వర్క్ దండేపల్లి, ముప్పారం, ధర్మసాగర్ చెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఐతా శ్రీనివాస్ 98660 62628 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.